నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

**పేద, మధ్యతరగతి ప్రజలపై మున్నేటి వరద ప్రభావం**
**తిరిగి కోలుకునేందుకు ఏడాది కంటే ఎక్కువ సమయం**
**ఈఎంఐలు చెల్లించలేక ఫోన్లు ఆఫ్ చేసుకుంటున్న బాధితులు**
**నెలవారీ అద్దెలు, కిస్తీలు, గిరిగిరి చెల్లింపులకూ కష్టమే**
**ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ముంపు ప్రాంత ప్రజలు**

# రూ.250 కోట్ల నష్టం

## మున్నేరు మార్చిన బతుకు చిత్రం
## ఖమ్మంలో తీవ్ర ప్రభావం

### ప్రతి ఇంటికి రూ.లక్ష ఇవ్వాలి



సీఎం రేవంత్‌రెడ్డి పదిహేను వేలు ఇస్తానని అంటున్నాడు. అవి దేనికి సరిపోతాయి? ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయాయి. ఎంతో కష్టపడుతూ ఏడాదికొకటి చొప్పున కొనుక్కున్నాం. ఇప్పుడవన్నీ వరదపాలయ్యాయి. ఇంట్లో ఉన్న క్వింటాళ్ల బియ్యమూ తడిసి ముద్దయ్యాయి. ఇన్నాళ్లూ ఆకలితోనే ఉన్నాం. ఈ రోజే గ్యాస్ ముట్టించాం. అంతా నష్టపోయిన మాకు పరిహారం ఇవ్వాలి. ఇంటికీ కనీసం రూ.లక్ష చొప్పున ఇవ్వాలి.

–దుర్గాలక్ష్మి, జూబ్లీపుర

### ఈఎంఐలకు వెసులుబాటు ఇవ్వాలి



వరద కారణంగా మా రిఫ్రిజిరేటర్ మునిగింది. మొత్తానికే పాడైంది. దాని ఈఎంఐ రూ.3,200 కట్టాలి. వరదకు సర్వం కోల్పోయిన మేము.. ఇప్పుడు వాటిని కట్టే స్థితిలో లేము. కరోనా సమయంలో ఇచ్చిన మాదిరిగా రెండు నెలలపాటు ఈఎంఐలకు గడువు ఇవ్వాలి. ప్రభుత్వం అటువంటి చర్యలు తీసుకోవాలి.

–శివరామకృష్ణ, సారథి నగర్

### రూ.2 లక్షల వస్తువులు నష్టపోయాం..



మున్నేరు వరదల వల్ల మా ఇంట్లోని రూ.2 లక్షల విలువైన వస్తువులను నష్టపోయాం. ఇంట్లో సీలింగ్ పోయింది. ఆ నష్టం వేరే. ప్రతి నెలా రూ.70 వేలకు పైగా కిస్తీలు చెల్లించాలి. ఇందులో గృహ రుణం కూడా ఉంది. వరదల కారణంగా మొత్తం నష్టపోవడం వల్ల ఈ ఈఎంఐలు చెల్లించే పరిస్థితిలో లేము. మమ్ములను ప్రభుత్వమే ఆదుకోవాలి.

–మంగ శ్రీశైలం, వెంకటేశ్వనగర్

### పేదల గురించి ప్రభుత్వం ఆలోచించాలి..



మున్నేరు వరదల కారణంగా ఇక్కడి ప్రజలు ఎంతో కోల్పోయాం. ముఖ్యంగా మాలాంటి పేదల గురించి ప్రభుత్వం ఆలోచించాలి. ఇళ్లను, ఇళ్లలోని వస్తువులను కోల్పోయిన మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలి. ఈఎంఐలు చెల్లిస్తూ ఇంట్లోని వస్తువులు సమకూర్చుకుంటున్నాం. ఇప్పుడు వరదల వల్ల ఈఎంఐలు కట్టే పరిస్థితి లేదు.

–గుడిపల్లి దివ్య, జూబ్లీపుర

ఖమ్మం, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పేద, మధ్యతరగతి ప్రజల జీవనాన్ని మున్నేరు వరదలు పూర్తిస్థాయిలో దెబ్బతీశాయి. వారి కష్టమంతా వరదపాలైంది. దాదాపు ఖమ్మం నగరంలోనే సుమారు 30 వేల కుటుంబాలు వరద దెబ్బకు విలవిల్లాడుతున్నాయి. ఇంట్లోని నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, విలువైన ఫర్నీచర్, దుస్తులు, ఇతర సామగ్రి మొత్తం నష్టపోయారు. ఒక్కో ఇంటికి దాదాపుగా రూ. 2 లక్షల చొప్పున నష్టం లెక్కగట్టినా అధికారిక గణాంకాల ప్రకారం.. 5 వేల ఇళ్లకు రూ.100 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లవుతోంది. ఇవికాకుండా వివిధ రకాల మెటీరియల్స్, ఇతర వస్తువులు కలుపుకొని దాదాపు 15 వేల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున అంచనా వేసినా మరో రూ.150 కోట్ల నష్టం వాటిల్లినట్లవుతోంది. అంటే.. కేవలం ఖమ్మం నగరంలోనే.. అదీ కుటుంబాల వారీగానే రూ.250 కోట్ల మేర నష్టం జరిగినట్లు. ఇవికాకుండా ప్రభుత్వపరంగా రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, ఇతరత్రాల నష్టమూ రూ.కోట్లలోనే ఉంటుంది.

**పేద, మధ్యతరగతి ప్రజలపైనే అధిక భారం**

మున్నేరు పరీవాహకంలో అత్యధికంగా పేద, మధ్యతరగతి ప్రజలే నివసిస్తున్నారు. వీరంతా పలు రకాల వస్తువులను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసి నెలవారీ ఈఎంఐలు చెల్లిస్తున్నారు. ఇంట్లో వినియోగించుకునే టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, గ్రైండర్లు, ఏసీలు, బెడ్స్ తదితర వస్తువులన్నింటినీ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి రుణంగా తీసుకొని ఈఎంఐలు చెల్లిస్తున్నారు. ఇవే కాకుండా బైకులు, ఆటోలు, కార్లు, వ్యాన్లు, టాటా ఏస్ వంటి వాహనాలను కూడా ఇదే పద్ధతిలో కొనుగోలు చేసి వాటిని నడుపుకుంటూ జీవిస్తున్నారు. గడిచిన పది రోజులుగా కురిసిన వర్షాలకు, మొన్న వచ్చిన మున్నేరు భారీ వరదలకు వీటిలో చాలా వరకూ అక్కడి ప్రజలు కోల్పోయారు. మరికొన్ని వస్తువులు దెబ్బతిన్నాయి. దీంతో కోల్పోయిన, దెబ్బతిన్న వస్తువుల నష్టాన్ని మొత్తం అక్కడి ప్రజలు భరిస్తూనే క్రమం తప్పకుండా ఈఎంఐలు చెల్లించాల్సి వస్తోంది. కానీ.. ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా ఆయా వస్తువులను, ఉపాధిని కోల్పోయిన మున్నేరు పరీవాహక ప్రజలు ఈఎంఐలు చెల్లించే పరిస్థితి కోల్పోయారు. నెలవారీ అద్దెలు, కిస్తీలు, గిరిగిరీలు చెల్లించలేని కొందరైతే తమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు. ఇక బ్యాంకు రుణాల ద్వారా ఇళ్లు కొనుగోలు చేసిన వాళ్లు కూడా సదరు బ్యాంకర్లను కలిసి గోడు వెళ్లబోసుకుంటున్నారు.



ఖమ్మం కాల్వొడ్డులో తోపుడు బండిని రిపేరు చేస్తున్న వ్యాపారి

**కిక్కిరిసిన మెకానిక్ షెడ్లు**

వరద ముంపునకు గురైన బైకులు, ఆటోలు, కార్లను వాటి యజమానులు రిపేరుకు తీసుకొస్తుండడంతో ఖమ్మంలోని వివిధ మెకానిక్‌ల షెడ్లన్నీ కిక్కిరిస్తున్నాయి. బురదతో దెబ్బతిన్న ఆయా వాహనాలకు తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకూ ఖర్చవుతోందని వాహనాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పూర్తికాని పారిశుధ్య పనులు**

వరద ప్రభావం తగ్గి రోజులు గడుస్తున్నా పారిశుధ్య పనులు మాత్రం ఇంకా పూర్తి కాలేదు. కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో వ్యర్థాలు ఇంకా రోడ్లపైనే ఉన్నాయి.

### కిస్తీల చెల్లింపులకు గడువు ఇవ్వాలి..



ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో మా ఇళ్లన్నీ మునిగిపోయాయి. మా ఇంట్లోని వస్తువులన్నింటినీ కోల్పోయాం. మరికొన్ని వస్తువులు పాడయ్యాయి. వాయిదాల పద్ధతిలో కొనుక్కున్న వస్తువులకు ఇప్పుడు మేము కిస్తీలు కట్టే పరిస్థితిలో లేము. కిస్తీల చెల్లింపులకు గడువు పెంచితే బాగుంటుంది.

–ఎలుగు పద్మ, జూబ్లీపుర

# వరద గోదావరి

- భద్రాచలం వద్ద 48.50 అడుగులకు చేరిన నీటిమట్టం
- రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసిన అధికారులు
- ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు నిలిచిపోయిన రాకపోకలు



రెండు బ్రిడ్జిల మధ్య ఉరకలెత్తుతున్న గోదావరి

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 10 : ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి పోటెత్తింది. మంగళవారం ఉదయం 7.32 గంటలకు 43.2 అడుగులకు నీటిమట్టం చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. తర్వాత గంట గంటకూ అడుగు చొప్పున వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. దీంతో సాయంత్రం 5.15 గంటలకు 48 అడుగులకు నీరు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. రాత్రి 7 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను దాటి 48.50 అడుగుల వద్ద గోదావరి ఉరకలు వేస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటు పెరుగుతున్న గోదావరికి తోడు.. అటు శబరి వరద కూడా గోదావరికి పోటెత్తింది. ఇప్పటికే తాలిపేరు ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తడంతో దిగువకు వరద నీరు విడుదల కావడంతో భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతోంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఎన్నడూ లేని విధంగా వరద ప్రవాహం గంటకు అడుగు చొప్పున 15 అడుగులు పెరిగినట్లు సీడబ్ల్యూసీ అధికారులు చెబుతున్నారు. రాత్రి 11 గంటలకు 49.50 అడుగులకు నీటిమట్టం చేరింది. రెండో ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. చింతూరు వద్ద శబరి నది గోదావరికి పోటెత్తడంతో సారపాక, భద్రాచలం వద్ద ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర వాహనాల రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేశారు.

**అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. భద్రాచలం వరద ప్రవాహం అంతకంతకూ పెరగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వరదల విషయంలో అధికారులు 24 గంటలూ మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వరద పెరిగే ప్రాంతాలను అధికారులు గుర్తించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

# తగ్గిన తాలిపేరు వరద ఉధృతి



తాలిపేరు గేట్లు ఎత్తడంతో విడుదలవుతున్న నీరు

చర్ల, సెప్టెంబర్ 10 : ఎగువ నుంచి వస్తున్న వరదతో పెరుగుతూ తగ్గుతున్న తాలిపేరు ప్రాజెక్టు వరద ఉధృతి మంగళవారం శాంతించింది. నీటి ఉధృతి దృష్ట్యా సోమవారం రాత్రి 25 గేట్లు ఎత్తి 1.80 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. మంగళవారం ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు నీటిమట్టం సాధారణ స్థితికి చేరింది. ప్రస్తుతం స్వల్పంగా నీరు వస్తుండడంతో 25 గేట్లు ఎత్తి 37,212 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే గోదావరి తీర ప్రాంతాలైన కొత్తపల్లి, దండుపేట, లింగాపురం, గొంపల్లి, జీపీ పల్లి, వీరాపురం తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

# కలెక్టరేట్ ఎదుట 'భోజన' కార్మికుల ధర్నా




భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 10 : మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలతోపాటు అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతన హామీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంటావార్పు పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, విజయలక్ష్మి, పుష్ప, మంగ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# 'సీజనల్'పై అవగాహన కల్పించాలి

## డీఎంహెచ్‌వో డాక్టర్ వరికూటి సుబ్బారావు



చింతకానిలో ల్యాబ్ టెస్టుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చింతకాని, సెప్టెంబర్ 10 : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వరికూటి సుబ్బారావు అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకే చింతకాని పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణులు, జనరల్ వార్డు, ల్యాబ్ టెస్టులు, మెడికల్ స్టోర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటింటా జ్వర సర్వే తీరును డాక్టర్ అల్తాఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో వచ్చిన సమయానికి పీహెచ్‌సీలో రోగులు ఎక్కువగా ఉండడంతో పల్లె దవాఖానల్లో చూపించుకోవాలని వారికి సూచించారు. పల్లె దవాఖానల్లో వైద్య సిబ్బంది తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని, అవసరాన్ని బట్టి వారి కాలనీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మహ్మద్ అల్తాఫ్, సిబ్బంది సైదులు, శ్రీనివాస్, ఉదయ్, అరుణ పాల్గొన్నారు.

# పంట నష్టం సర్వేను వేగవంతం చేయాలి

## జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



పంట పొలాలను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య, ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 10 : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంట పొలాల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య ఆదేశించారు. మండలంలోని కస్నాతండా, వాల్యతండాల్లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌తో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. మున్నేరు వరద ప్రవాహంతో కొట్టుకుపోయిన పంటలు, ఇసుక మేటలు, భూమి కోత తదితర అంశాలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడారు. ఒక్క ఎకరానికి పెట్టుబడి ఎంత అయ్యింది? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ వారం రోజుల క్రితం జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు, మున్నేటి వరద తీవ్రతకు పంటలు దెబ్బతిన్నాయని, దీనిపై ఇప్పటికే ప్రాథమిక నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశామన్నారు. నష్టం విలువను పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు జిల్లావ్యాప్తంగా వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయాధికారులు గ్రామాల్లో పంటలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలేరు డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి బీ సరిత, ఏవో ఉమానగేశ్, పాలేరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి అపర్ణ, ఏఈవోలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

- అలంకారప్రాయంగా పెసర్ల కొనుగోలు కేంద్రాలు
- తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతున్న అధికారులు
- చేసేది లేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- ప్రతి గింజనూ కొనుగోలు చేయాలంటున్న రైతు సంఘాలు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అపరాల యార్డుకు రైతులు తీసుకొచ్చిన పెసర్లు

# పెసరంత కొనలే..!



తేమ శాతం నిర్ధారణ చేస్తున్న మార్క్‌ఫెడ్ సిబ్బంది

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 10 : మార్కెట్‌లో సిండికేట్‌గా మారిన ప్రైవేటు వ్యాపారులు రైతులు పండించిన పెసర్లకు మద్దతు ధర రాకుండా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆరుగాలం శ్రమించి పంట పండించినా ధర దక్కడం లేదని రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో గత నెల 31న ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్లలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్ల బాధ్యతను మార్క్‌ఫెడ్ అధికారులు డీసీఎంఎస్‌కు అప్పగించారు. రైతులు మార్కెట్‌కు తరలించే పెసర్లకు 12 శాతం లోపు తేమ ఉంటేనే మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేసే అవకాశం ఉండడం.. ఈ క్రమంలోనే ఖమ్మం మార్కెట్‌కు వారాంతపు సెలవులు రావడం.. భారీ వర్షాలు, వరదల కారణంగా అధికారులు జిల్లాలో సెలవులు ప్రకటించారు. వర్షాలతో రైతులు పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి క్రయవిక్రయాలు జరిగిన నాలుగైదు రోజుల్లో సైతం ఒక్క రైతు పంటను కూడా అధికారులు కొనలేకపోయారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది రైతులు దాదాపు 15 వేల ఎకరాల్లో పెసర పంట సాగు చేశారు. దీంతో 40 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అయితే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యే నాటికి రైతులు మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకురావడం ప్రారంభించారు. ఈ ఏడాది పెసర పంటకు మద్దతు ధర క్వింటా రూ.8,682 చొప్పున ప్రకటించారు. అదే ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.7,400 మించి ధర పెట్టడం లేదు. దీంతో సాగు రైతులు క్వింటా ఒక్కంటికి రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ధర కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఏర్పాటైన ప్రత్యేక కొనుగోలు కేంద్రాల్లో సైతం రైతులకు లాభం జరగడం లేదు. కొర్రీలు పెడుతున్నారే తప్ప పంటను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదని రైతులు వాపోతున్నారు. తీరా ఇంత దూరం పంట ఉత్పత్తులను తీసుకొచ్చిన రైతులు మళ్లీ ఇంటికి తీసుకెళ్లలేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సంబంధిత అధికారులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే నిబంధనలు సవరించి పెసర్లను కొనుగోలు చేస్తారా.. లేదా.. అనేది వేచి చూడాల్సిందే.

### జెండా ధరకు మార్క్‌ఫెడ్ కొనలేదు..



ఈ ఏడాది నాకున్న పదెకరాల్లో ఐదెకరాల్లో పెసర పంట సాగు చేశాను. తీరా చేతికొచ్చే సమయానికి వర్షాలు రావడంతో మూడెకరాల్లో పంట నేలపాలైంది. రెండెకరాల్లో మాత్రమే పంట మిగిలింది. చేతికొచ్చిన పెసర్లను అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చా. జెండాపాటలో తొలుత క్వింటాకు రూ.7,200 పలికింది. నేను తీసుకొచ్చిన పంటకు సైతం ఖరీదుదారులు క్వింటాకు రూ.7,200 ధర పెట్టారు. అయితే మార్క్‌ఫెడ్ అధికారులు పరిశీలించి తేమ శాతం ఎక్కువగా ఉందని చెప్పి నా పంటను కొనలేదు. మార్క్‌ఫెడ్ అధికారులు పంటను కొంటే క్వింటా ఒక్కంటికి అదనంగా రూ.1,400 రాబడి వచ్చేది.

–సత్యనారాయణ, రైతు, అన్నవరం, కొణిజర్ల మండలం

### తేమ శాతంపై వాతావరణ ప్రభావం



వాతావరణ ప్రభావం కారణంగానే పెసర్లలో తేమ శాతం పెరుగుతుంది. దీంతో పంటను కొనుగోలు చేయలేకపోతున్నాం. కొనుగోలు కేంద్రం ప్రారంభమైన తర్వాత మార్కెట్‌కు వరుస సెలవులు, ఆ తర్వాత వర్షాలు, వరదల కారణంగా సెలవు ఉండడంతో పంట యార్డుకు రాలేదు. క్రయవిక్రయాలు జరిగిన నాలుగైదు రోజుల్లో నాణ్యమైన పంట యార్డుకు రాలేదు. కనీసం తేమ శాతం 12–14 ఉన్నా కొనుగోలు చేస్తాం. బుధవారం నుంచి 14 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేసేందుకు యత్నిస్తాం. ఉష్ణోగ్రతలు పెరిగితే విరివిగా పెసర్లను కొనుగోలు చేస్తాం.

–సునీత, మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా మేనేజర్